క్లుప్తంగా

నేడు లక్షతులసి పూజ

అంబాజీపేట: అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామికి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే లక్షతులసి పూజ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ లక్షతులసి పూజలో పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

యూటీఎఫ్ సేవలు అభినందనీయం

రాజోలు: ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తూ విద్యార్థుల సంక్షేమానికి, విద్యాభివృద్ధికి సహకారం అందిస్తున్న యూటీఎఫ్ సేవలు అభినందనీయమని రాజోలు సాగు నీటి పంపిణీ సంఘ చైర్మన్ పినిశెట్టి బుజ్జి అన్నారు. శనివారం శివకోడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులు 76 మందికి, శివకోడు ఉన్నత పాఠశాల విద్యార్థులు 64 మందికి యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. స్టడీ మెటీరియల్‌కు నీటి సంఘ చైర్మన్ బుజ్జి ఆర్థిక సహకారం అందించారని మండల యూటీఎఫ్ అధ్యక్షుడు కె.రాజబాబు తెలిపారు. జిల్లా కార్యదర్శి అడబాల కాశీవిశ్వేశ్వరరావు, ఉండవల్లి శ్రీనివాస్, అప్పారి దుర్గ, మండల ప్రధాన కార్యదర్శి కేవీఎస్ఎన్ బాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి

రాజోలు: ఆర్టీసీ డిపో అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం రాజోలు డిపోలో ఐదు కొత్త బస్సులను ఎమ్మెల్యే దేవ ప్రారంభించారు. గతంలో ఆరు బస్సులను ప్రారంభించగా కొత్త బస్సుల సంఖ్య 11కు చేరిందని డిపో మేనేజర్ భాస్కరరావు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా సమయపాలన పాటించాలని, అన్ని గ్రామాల్లో ఆర్టీసీ బస్సు తిరిగే విధంగా రూట్ మ్యాప్‌లు సిద్ధం చేయాలన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుంగుబోగుల పెద్దకాపు, సాగునీటి పంపిణీ సంఘ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, ఎంపీపీ కేతా శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి బుజ్జి పాల్గొన్నారు.

అసంపూర్తి భవనాలను పూర్తి చేస్తాం

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిన పలు ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి అసంపూర్తి భవనాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అనేక గ్రామాల్లో అసంపూర్తి భవనాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ భవనాల స్థితిగతులను బట్టి ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు తయారు చేయించనున్నామన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పి.గన్నవరం: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య, బడ్జెట్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. 2025–26 సంవత్సరానికి రూ.68,53,76,000లు ఆదాయం, రూ.68,53,20,000 వ్యయంగా చూపుతూ రూ.56 వేల మిగులు బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. కుందాలపల్లిలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి రెండు సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చిన పప్పుల సాయిబాబును ప్రజా ప్రతినిధులు, అధికారులు సత్కరించారు. ఎంపీడీఓ కేవీ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



రాజోలులో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

రాజోలు/అంబాజీపేట/మలికిపురం/మామిడికుదురు/కొత్తపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధించే దిశగా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ శనివారం పరిశీలించారు. మలికిపురం మండలంలోని కేశనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. కళాశాల పరిధిలోని గ్రామాల ప్రజా పతినిధులు భోజనాలు వడ్డించి ప్రారంభించారు. మామిడికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నూతనంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులు మెచ్చి సంతృప్తిగా తినేలా తగినంత నాణ్యమైన భోజనం వండి వడ్డించాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు ప్రిన్సిపాల్, అధ్యాపకులకు సూచించారు.

కాలిబాటలతో మంచి దిగుబడి

- తగ్గనున్న తెగుళ్ల ఉధృతి
- క్లస్టర్‌లోని 11 మండలాల్లో చురుగ్గా రబీ పనులు
- వ్యవసాయశాఖ సూచనలు తప్పనిసరి



పెదపళ్లలోని పంట పొలాల్లో కాలిబాటలు వేస్తున్న రైతు కూలీలు



కాలిబాటలతో ఏపుగా పెరుగుతున్న వరి మొక్కలు

ఆలమూరు: డెల్టా ప్రాంతాల్లో వరిసాగుకు అధిక ప్రాధాన్యం ఉంది. వ్యవసాయశాఖ సూచనలు, సలహాలతో రైతులు రబీ సాగు చురుగ్గా జరుగుతుంది. వరిసాగులో కనీస జాగ్రత్తలు తీసుకుని ఎరువులు, పురుగు మందులను వినియోగించుకుని సాగు చేస్తే చక్కని ఫలితాలను సాధించడంతో పాటు వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసిన నేపథ్యంలో పండించిన పంటను విక్రయించుకుని సొమ్ము చేసుకోవడం ద్వారా రైతులు రబీ సీజన్‌పై దృష్టి సారించారు. ఈ సీజన్‌లో వరినాట్లను ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలన్న వ్యవసాయశాఖ సూచనలకు అనుగుణంగా రైతులు తమ పనులను ముమ్మరం చేశారు. దీంతో క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజక వర్గాల్లోని 11 మండలాల్లో సాగు చేస్తున్న సుమారు 58 వేల ఎకరాల్లో అధిక భాగం వెద జల్లు విధానాన్ని రైతులు ఎంచుకున్నారు. దీంతో సుమారు 15 వేల ఎకరాల్లో మాత్రమే పరిమిత స్థాయిలో నారుమళ్లు వేస్తున్నారు. వరినాట్లు వేసే సమయంలో రైతులు కాలిబాటలు వేయడం వల్ల చీడపీడల నివారణ సాధ్యమవుతుందని, తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని ఉద్దేశంతో వ్యవసాయ శాఖ సూచనలను రబీ సీజన్‌లో రైతులు తప్పనిసరిగా ఆచరిస్తున్నారు.

కాలిబాటలు రైతులకు ఎంతో మేలు

వరిసాగు చేసిన రైతులు తమ పంట పొలాల్లో వరి సాగును చేపట్టే సమయంలో కాలిబాటలు వేసుకుంటే చక్కని ఫలితాలు సాధించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. పంటపొలాల్లో నిర్ణీత దూరంలో కాలిబాటలు వేయడం ద్వారా పంట చేలకు గాలి, వెలుతురు సమృద్ధిగా లభ్యమవుతాయి. వరి పైరు ఆహ్లాదకర వాతావరణంలో ఆరోగ్యవంతంగా పెరుగుతుంది. గాలి తగినంత విధంగా అందడం వల్ల నీటిలో పెరిగే వరి మొక్కలు ఆక్సిజన్ తీసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. తుపాన్లు, భారీ వర్షాల వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు సంభవించినప్పుడు రైతులకు కీడు కాకుండా మేలు చేస్తాయి. కాలిబాటలు వేసిన పంట చేలల్లోని మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుంది. కాలిబాటలు వేసిన పొలంలో రైతులు సులభంగా పురుగు మందులు, కలుపు మందులు పిచికారీ చేసుకోవచ్చు. ఎరువులను సులభంగా వేసుకోవచ్చు. కాలి బాటలు వేస్తే తరచూ పొలం మధ్యలో తిరిగి పంటను పరిశీలించే అవకాశం ఉంటుంది. అలాగే ఎలుకల వల్ల జరుగుతున్న నష్టాన్ని ఎప్పటికప్పుడు గమనించవచ్చు. పొలంలో నీటి పరిస్థితిపై ఒక అవగాహనకు వచ్చేందుకు వీలుంటుంది. పైరులో చీడపీడల ఉనికిని, తెగుళ్ల ఉధృతి అతి సమీపం నుంచి గమనించి తదనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చేపట్టవచ్చు. కాలిబాటలు వేయడం వల్ల గాలి ప్రసరించి దోమ ఉధృతి తగ్గుతుంది.

కాలిబాటలకు ప్రత్యేకత



వరిసాగులో కాలిబాటలు వేయడం వల్ల రైతులకు అధిక లాభం కలుగుతుంది. చీడపీడలను నివారించడంతో పాటు వరి మొక్కలు ఏపుగా పెరిగే అవకాశం ఉంటుంది. కాలిబాటలు వేయడం వలన వరి దుబ్బులకు గాలి బాగా సోకడానికి అవకాశం ఉంటుంది. అదే విధంగా రైతు ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడానికి సౌలభ్యంగా ఉంటుంది. ఇటీవల కాలంలో వ్యవసాయశాఖ సూచనల మేరకు కాలిబాటలపై రైతుల్లో అవగాహన పెరుగుతుంది.

– ఎస్.లక్ష్మీ లావణ్య, ఏవో, ఆలమూరు

రీ సర్వేకు ప్రజలు సహకరించాలి

మామిడికుదురు: రీ సర్వేకు ప్రజలు, రైతులు పూర్తి సహకారం అందించాలని తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులు కోరారు. ఈదరాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం రీ సర్వే గ్రామ సభ సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ప్రతి ఒక్కరి భూమిని సర్వే చేసి దాన్ని నిర్ధారించడం వల్ల ప్రజలకు, రైతులకు భవిష్యత్తులో రెవెన్యూ పరంగా ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. వీటిని పూర్తి స్థాయిలో పరిష్కరించే లక్ష్యంతోనే ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందని తెలిపారు. గ్రామ సభలో డీటీ శరణ్య, పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కె రాజు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారిని శనివారం భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. దేవదాయ ఉప కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.78,195, అన్నప్రసాదం విరాళాలు రూపంలో రూ. 19,570 వచ్చినట్టు డీసీ తెలిపారు.

ఎస్సీ కులగణనలో బుడగ జంగాలను లెక్కించాలి

మామిడికుదురు: ఎస్సీ కుల గణనలో బుడగా జంగం కుల జనాభాను కూడా లెక్కించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం తహసీల్దార్ ఎంవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులకు సంఘం నేతలు వినతి పత్రం ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ కమీషన్ విచారణలో ఎస్సీ ఉప కులాల జాబితాలో ఆన్‌లైన్‌లో తమ కులం ప్రస్తావన లేదన్నారు. దీని వల్ల తమ కులానికి అన్యాయం జరుగుతుందని వాపోయారు. తమ కులానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ కులం వివరాలు కూడా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో బుడగ జంగం అధ్యక్షుడు ముగ్గ త్రిమూర్తులు, కుల నాయకులు పాల్గొన్నారు.

ముక్కామల పీహెచ్‌సీని తరలించవద్దు



హెల్త్ డైరెక్టర్ పద్మావతికి వినతిపత్రం ఇస్తున్న ముక్కామల ప్రజలు

అంబాజీపేట: ముక్కామలలో ఉన్న పీహెచ్‌సీని ఎక్కడకూ తరలించకుండా ఇక్కడే వైద్య సేవలు అందించాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పద్మావతిని స్థానికులు కోరారు. స్థానిక పీహెచ్‌సీలో భవనం సరిగా లేని నెపంతో పుల్లేటికుర్రు తరలించాలన్న ఆలోచనను ఉపసంహరించుకోవాలని వినతిపత్రాన్ని అందజేశారు. 1974లో ప్రభుత్వ డిస్పెన్సరీని ఏర్పాటు చేసి, 2019లో పీహెచ్‌సీగా అభివృద్ధి చేశారన్నారు. పీహెచ్‌సీ అదనపు భవన నిర్మాణానికి 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.90 లక్షలు నిధులు మంజూరు కావడంతో గ్రామ పంచాయతీ సహకారంతో పీహెచ్‌సీ పరిసరాలలో ఆక్రమణలు తొలగించి భవన నిర్మాణానికి స్థలాన్ని సిద్ధం చేశామన్నారు. ఆ నిధుల నుంచి సుమారు రూ.18 నుంచి 25 లక్షలతో పాత భవనం మరమ్మతులతో పాటు వైద్య పరికరాలు కొనుగోలు చేశారన్నారు. ముక్కామలతో పాటు పసుపల్లి, ఎస్.పెదపాలెం, సానబోయినవారిపాలెం, మొసలపల్లి, వక్కలంక, కముజువారిలంక, ఇరుసుమండ, నేదునూరు పంచాయతీ పరిధిలో ప్రజలకు 50 ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు. స్థానిక పీహెచ్‌సీలో అదనపు భవనం నిర్మించాలని ఆయా పంచాయతీల గ్రామ సభల్లో తీర్మానాలు చేసుకున్నామన్నారు. ప్రస్తుత పీహెచ్‌సీని ముక్కామల నుంచి తరలించి పుల్లేటికుర్రులో ఏర్పాటు చేస్తే సంబంధిత గ్రామ ప్రజలు వైద్య సేవలకు దూరమవుతారన్నారు. పీహెచ్‌సీని యథాస్థానంలో నిర్వహిస్తూ దాని అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని హెల్త్ డైరెక్టర్ పద్మావతిని కోరారు. కార్యక్రమంలో బండారు మల్లిబాబు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి



కొత్తపేటలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గోవిందరావు

కొత్తపేట: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించడం ద్వారా తమ ప్రాణాలు కాపాడుకోవాలని స్థానిక డీఎస్పీ వై.గోవిందరావు సూచించారు. వాహనదారులు హెల్మెట్ ధరించడం వలన ప్రయోజనంపై అవగాహన, ప్రచారంలో భాగంగా కొత్తపేటలో డీఎస్పీ గోవిందరావు ఆధ్వర్యంలో వాహనాలకు ఫ్లెక్సీలు అమర్చి ప్రచారాన్ని ప్రారంభించారు. శనివారం సాయంత్రం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో డీఎస్పీ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదాల్లో వాహనదారుల తలకు ఏ చిన్న గాయం కాకుండా సురక్షితంగా ఇంటికి చేరేందుకు హెల్మెట్ ధారణ తప్పనిసరి అని అన్నారు. మనిషి అవయవాల్లో దేనికి గాయమైనా పెద్ద ప్రమాదం కాదని, అదే తలకు ఏ మాత్రం గాయమైనా ప్రాణాంతకమని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికి వారు మనం నిదానంగా వాహనాన్ని నడుపుతూ జాగ్రత్తగా ప్రయాణిస్తున్నామని అనుకుంటారు. అయితే ఎదురుగా వచ్చే వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ దూకుడుగా వచ్చి ఢీకొడితే రెండు వాహనదారులు ప్రమాదనికి గురవుతారని హెచ్చరించారు. అందువల్ల హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యం చేయకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని డీఎస్పీ గోవిందరావు కోరారు. కార్యక్రమంలో ఎస్సై జి.సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోట పరామర్శ



మునీశ్వరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ తోట

ఆలమూరు: ఆలమూరులో మాతృవియోగంతో బాధపడుతున్న వ్యాపారవేత్త, మండల కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావును ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. స్థానిక పసుపులేటి గూడెంలో నివాసం ఉంటున్న ప్రభాకరరావు నివాసానికి శనివారం ఆయన విచ్చేసి కుటుంబసభ్యులను పరామర్శించారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి చైర్మన్‌గా పనిచేసిన మాతృమూర్తి మునీశ్వరమ్మ మృతికి గల కారణాలను ఆమె కుమారులను అడిగి తెలుసుకున్నారు. చల్లా కుటుంబీకులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం మృతురాలు మునీశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కుడా చైర్మన్ తుమ్మలపల్లి బాబు, జనసేన నేత బండారు శ్రీనివాసు పరామర్శించిన వారిలో ఉన్నారు.

అంధులకు మార్గదర్శిగా 'బ్రెయిలీ లిపి'



బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ సాయిబాబు

రాజోలు: ఎందరో అంధులకు బ్రెయిలీ లిపి మార్గదర్శిగా నిలిచిందని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. శనివారం కళాశాలలో బ్రెయిలీ లిపి ఆవిష్కరించిన లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ టచ్ రీడింగ్, రైటింగ్ సిస్టమ్ యొక్క విశిష్టతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ టీఎస్‌వీ పద్మనాభం, పీఆర్వో నల్లి రాజు, లక్ష్మి, అశ్వని, సరిత తదితరులు పాల్గొన్నారు.

అంధుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి

అంబాజీపేట: అంధుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమానురాగాలు కలిగి ఉండి వారిలో ఆత్మస్థైర్యం నింపాలని ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఐఈ కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. మాచవరం భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని ఐఈఆర్టీ ఉపాధ్యాయులు ఎస్‌కే బేగం అధ్యక్షతన శనివారం నిర్వహించారు. అంతకుముందు లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐఈఆర్టీ ఉపాధ్యాయులు బేగం సమకూర్చిన బిస్కట్లు, స్వీట్లు, ప్లేట్లను దివ్యాంగులకు అందజేశారు. అంతకుముందు కేకును కట్ చేసి విద్యార్థులకు పంచారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్ ఎస్.సన్ షైన్, ఐఈఆర్టీ ఎం.ఆశ, హెచ్‌ఎం నాగజ్యోతి, సీఆర్పీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌తో క్షమాపణ చెప్పించిన కూటమి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీకర్

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం ఎస్ఎన్‌వీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు నాయకులను వేదికపైకి విద్యార్థులతో పిలిపించారు. ఈ సభలో వైఎస్సార్ సీపీకి చెందిన వైస్ ఎంపీపీని వేదికపైకి ఆహ్వానించి జనసేన పార్టీకి చెందిన వైస్ ఎంపీపీని ఎందుకు పిలవలేదని ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావును కూటమి నాయకులు నిలదీశారు. దీంతో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తను ప్రోటోకాల్ ప్రకారమే స్థానిక ఎంపీటీసీని ఆహ్వానించామన్నారు. విద్యార్థులు మైక్ అనౌన్స్ చేయడంలో పొరపాటున స్థానిక ఎంపీటీసీకి బదులు వైస్ ఎంపీపీ అని పిలవడం జరిగిందన్నారు. ఇది తన తప్పుగా భావిస్తూ వేదికపై ఉన్న ఎమ్మెల్యేకు, ఆర్డీఓకు, కూటమి నాయకులకు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు క్షమాపణ చెప్పారు. అయినా ఆగని కూటమికి చెందిన మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుపై ఆగ్రహంతో ఊగిపోయారు. దీంతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ జోక్యం చేసుకుని సర్ది చెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

కిశోర వికాసంపై విస్తృత ప్రచారం

రాజోలు: కిశోర వికాసంపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం జరగాలని సీడీపీఓ వైడీకే రమాదేవి అన్నారు. శనివారం రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసంపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి దివ్యదర్శిని, సీడీపీఓ రమాదేవిలు బాలికలు ఆరోగ్య పరంగా ఎదుర్కొనే సమస్యలు, వ్యక్తిగత భద్రత పరిశుభ్రత, పౌష్టికాహారం, బాల్య వివాహాలు నివారణ పోక్సో యాక్ట్ అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు, షేక్ ఇస్మాయిల్, సర్పంచ్ రేవు జ్యోతి, సూపర్‌వైజర్లు సరస్వతి, క్రాంతి, బాల త్రిపురసుందరి, హైమవతి, భారతి, సరోజని, ప్రసన్న రాణి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు.

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అప్పనపల్లిలో కోలాహలం..

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు ఆలయం చుట్టూ ఏడ ప్రదక్షిణలు చేసి మొక్కులు మొక్కుకున్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.1,84,745 ఆదాయం వచ్చింది. 3,289 మంది భక్తులు స్వామిని దర్శించుకోగా 2,316 మంది నిత్యాన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.32,550 వచ్చిందన్నారు. నిత్య అన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.48,671 విరాళాలుగా అందించారని తెలిపారు.

'ఐ లవ్ ఆత్రేయపురం' ఎల్ఈడీ లైటింగ్ బోర్డు ఆవిష్కరణ



'ఐ లవ్ ఆత్రేయపురం' ఎల్ఈడీ లైటింగ్ బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట: మండల కేంద్రం ఆత్రేయపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద గల చెరువు గట్టు పార్కులో దివంగత మండపాక సింహాచలం (డ్రాయింగ్ మాస్టారు) జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన 'ఐ లవ్ ఆత్రేయపురం' ఎల్ఈడీ లైటింగ్ బోర్డును శనివారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆవిష్కరించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ లైటింగ్ బోర్డును ఏర్పాటు చేసిన డ్రాయింగ్ మాస్టారు కుమారులు బాలాజీ, ప్రసాద్, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అలాగే సింహాచలం మాస్టారు చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్యే సత్యానందరావును డ్రాయింగ్ మాస్టారు కుటుంబ సభ్యులు దుశ్శాలువాలతో సత్కరించారు.

అంకితభావంతో పనిచేస్తే ఎల్లవేళలా గుర్తింపు



వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అంబాజీపేట: విధి నిర్వహణలో భాగంగా విద్యార్థులకు సాంకేతిక పరమైన విద్యనభ్యసిస్తూ అంకితభావంతో పనిచేసేవారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని ఎంఈఓ–2 మోకా ప్రకాష్ అన్నారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో గత ఏడాది ఆగస్టులో ఉద్యోగ విరమణ చేసిన ముషిని వెంకటేశ్వరరావు సన్మాన సభ హెచ్ఎం పీవీ.కేశవచార్యులు అధ్యక్షతన శనివారం జరిగింది. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం



నీలిమ కుటుంబ సభ్యులకు సాయం చేస్తున్న మంత్రి, ఎంపీ

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితురాలు మార్గాని నీలిమకు, గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ సమకూర్చిన మొత్తం రూ.60 వేల నగదును మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్ బాలయోగి చేతుల మీదుగా ఇచ్చినట్టు సంస్థ అధ్యక్షుడు కట్టా భాస్కర్ అన్నారు. ఈ మేరకు శనివారం అమలాపురంలో పై మొత్తాన్ని మంత్రి, ఎంపీ చేతుల మీదుగా నీలిమ కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. కాగా ఆర్థిక సాయం చేసిన దానిలో పెద్ద మొత్తాలను ఇచ్చిన సంస్థ సభ్యులు కవురు మునేశ్వరరావు, జీఎంకే ట్రస్ట్ చైర్మన్ గుత్తుల మీరాకుమార్‌లను, మంత్రి సుభాష్ అభినందించినట్టు భాస్కర్ తెలిపారు. శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. సఖినేటిపల్లి లంక గ్రామంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న మార్గాని నీలిమకు చికిత్సకై సదరు గ్రామస్తులు, యూత్ సంయుక్తంగా కలిపి రూ.నాలుగు లక్షల పదివేల నగదు సాయం శనివారం చేశారు. ఈ మేరకు గ్రామ పెద్ద రేపూరి ఏసు నరసింహరాజా చేతుల మీదుగా నీలిమ తండ్రి కొండలరావుకు పై మొత్తాన్ని అందజేశారు.

విశేషంగా ఆకట్టుకున్న సైన్స్ ప్రాజెక్టులు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

పి.గన్నవరం: వినూత్నమైన ఆలోచనలతో విద్యార్థులు ప్రదర్శించిన అద్భుతమైన సైన్స్ ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. పి.గన్నవరంలో జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు. మూడు విభాగాల్లో రెండేసి ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన ప్రదర్శనలకు మరింత సృజనాత్మకతను జోడించి, రాష్ట్ర స్థాయిలో మన జిల్లాకు గుర్తింపు తీసుకుని రావాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా ఆకాంక్షించారు. ముగింపు సభలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో అందించిన తీరు, అందరినీ ఆలోచింపజేసిందన్నారు. జిల్లా సైన్స్‌ఫెయిర్‌కు జ్ఞాపికలు అందజేసిన ఎమినెంట్ ఇంజినీర్స్ మేనేజింగ్ డైరెక్టర్ దొంగ వాసుసాయిరామ్‌ను, సైన్స్‌ఫెయిర్ విజయవంతానికి కృషి చేసిన పాఠశాల హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్‌లను, జ్యూరీ చైర్మన్ సత్యారామ్‌తో పాటుగా, జ్యూరీ సభ్యులను ఎమ్మెల్యే, డీఈవో అభినందించారు. కార్యక్రమాలను సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంవీవీ సత్యనారాయణ, హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్, ఎంఈవోలు కోన హెలీనా, చింతా వీరభద్రానందం, ఎస్ఎంసీ చైర్మన్ నల్లా దుర్గారావు పర్యవేక్షించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.35 వేల విరాళం

అయినవిల్లి: నల్లచెరువు గ్రామంలో కొలువైన పద్మావతీ, గోదాదేవీ సమేత వేంకటేశ్వరస్వామి అన్నదాన పథకానికి బిక్కిన స్వాతి (అమెరికా) శనివారం రూ.35 వేల విరాళం సమర్పించారు.

ఎన్నికల్లో వలంటీర్లకు త్రిశంకు స్వర్గం చూపించారు

అయినవిల్లి: ఎన్నికల్లో వలంటీర్లకు కూటమి నాయకులు త్రిశంకు స్వర్గం చూపించారని ఏపీ వలంటీర్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ కామ్రేడ్ సత్తిబాబు అన్నారు. ఆయన శనివారం వలంటీర్ల జిల్లా కన్వీనర్ ఎం.సతీష్‌తో కలసి అయినవిల్లి మండలంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ సేవలందిస్తున్న వలంటీర్లను కూటమి ప్రభుత్వం గత ఆరు నెలలుగా పనిచెప్పక, జీతం నిలుపుదల చేసిందన్నారు. గ్రామ, వార్డు, వలంటీర్స్‌ను ఆకలిదప్పికలకు గురిచేయడం భావ్యం కాదన్నారు. ఆయన వెంట వలంటీర్లు ఉన్నారు.